www.hamsakalam.com

PRGI TGTEL/26/A3129

# హంస కలం వార్త

సంచలన తెలుగు దినపత్రిక

HAMSAKALAM VARTHA

ఎడిటర్ : వడ్ల మధుసూదన్ చారి



మేడ్చల్ మల్కాజిగిరి | సెప్టెంబర్ 8 మంగళవారం 2026 | సంపుటి : 1 | సంచిక : 110 | పేజీలు : 8 | వెల రూ. 4.00/- | ఎడిటర్ : వడ్ల మధుసూదన్ చారి

MEDCHAL ,MALKAJGIRI | TUESDAY AUGUST 8 2026 | VOL:1 | ISSUE: 110 | PAGES:8 | Rs. 4:00 | EDITOR:VADLA. Madhusudan chary

# తెలంగాణకు చీకటిరోజు

### 4 కోట్ల ప్రజలకు ఇది అవమానం

### కేసీఆర్ క్షమాపణ చెప్పాలి

### తాతా మధును బర్తరఫ్ చేయాలి: స్పీకర్‌పై వ్యాఖ్యలకు సీఎం రేవంత్‌రెడ్డి ఖండన



**హైదరాబాద్, సెప్టెంబర్ 07 :**

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఖండించారు. సోమవారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ సభా సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సభలో సీఎం అయినా, సభ్యుడైనా సమానమేనని అన్నారు. స్పీకర్‌పై సభ్యసమాజం తలదించుకునేలా కొందరు మాట్లాడారని చెప్పారు. ఇది సభకు జరిగిన అవమానమని అన్నారు. రాష్ట్రంలోని నాలుగు కోట్ల మంది ప్రజలకు జరిగిన అవమానమనీ, తెలంగాణకు ఇది చీకటిరోజని చెప్పారు. అనుచిత భాషతో దూషించడం క్షమించరాని నేరమని అన్నారు. ఇది దళితులకు జరిగిన అవమానం కాదనీ, అందరికీ జరిగిన అవమానమని వివరించారు. తెలంగాణ వస్తే దళితుడిని సీఎం చేస్తాననీ, దళితులకు మూడెకరాల భూమి ఇస్తాననీ, దళితబంధు ఇస్తానని కేసీఆర్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. దళిత ఉప ముఖ్యమంత్రిని బర్తరఫ్ చేశారని అన్నారు. నేరెళ్లలో ఇసుక లారీలను అడ్డుకున్న దళితులను చంపారని చెప్పారు. దళితుడు సీఎల్పీ నాయకుడైతే పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించి ప్రతిపక్ష హోదా నుంచి తొలగించారని వివరించారు. బీఆర్ఎస్‌ది దళిత వ్యతిరేక ఆలోచన అని విమర్శించారు. స్పీకర్ తల్లిని అవమానించేలా మాట్లాడటాన్ని

(మిగతా 2వ పేజీలో..)

## నల్లదుస్తులతో బీఆర్ఎస్ నిరసన

### అసెంబ్లీ లోపలికి వెళ్లేందుకు ఎమ్మెల్యేల యత్నం

### అడ్డుకున్న పోలీసులు.. వాగ్వాదం, తోపులాట

### కేటీఆర్, హరీశ్‌రావు సహా పలువురు అరెస్ట్

**హైదరాబాద్, సెప్టెంబర్ 07 :**

తెలంగాణ అసెంబ్లీ వద్ద సోమవారం తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో నినాదాలు రాసిన నల్ల టీషర్టులు ధరించి లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు గేటు వద్దే అడ్డుకోవడంతో తీవ్ర గందరగోళం నెలకొంది. ఉదయం గన్‌పార్క్ నుంచి ర్యాలీగా అసెంబ్లీ గేటు వద్దకు నల్ల టీషర్టులు ధరించి ప్లకార్డులతో వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు లోపలికి వెళ్లేందుకు యత్నించారు. అయితే వారిని పోలీసులు అడ్డుకోగా.. వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. ఈ క్రమంలో నేతలు రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. అసెంబ్లీ పరిసర

(మిగతా 2వ పేజీలో..)



## మహిళలను కించపరిచేలా వ్యాఖ్యలు చేస్తే చర్యలు తప్పవు : సీఎం విజయ్

చెన్నై : మహిళలను కించపరిచేలా వ్యాఖ్యలు చేస్తే ఎంతటి వారిపైనైనా చట్టం ప్రకారం చర్యలు తప్పవని తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ స్పష్టం చేశారు. అసెంబ్లీలో ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. భావ ప్రకటనా స్వేచ్ఛను బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని విజయ్ సూచించారు. ప్రజలను, ముఖ్యంగా ... మహిళలను అవమానించే విధంగా మాట్లాడటం సరికాదన్నారు. రాజకీయ విమర్శలకు స్వేచ్ఛ ఉన్నప్పటికీ.. మహిళలను కించపరిచే వ్యాఖ్యలకు మాత్రం అడ్డుపెట్టుకోలేమని స్పష్టం చేశారు. గతంలో అసెంబ్లీలో మాజీ ముఖ్యమంత్రి జయలలిత ఎదుర్కొన్న అవమానాలను కూడా ఆయన ప్రస్తావించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల

(మిగతా 2వ పేజీలో..)



## సర్ గడువు పొడిగింపు

### నవంబర్ 9న తుది ఓటరు జాబితా ప్రచురణ

### క్లెయిమ్‌లు, అభ్యంతరాల గడువు అక్టోబర్ 7 వరకు పొడిగింపు

**హైదరాబాద్, సెప్టెంబర్ 07 :**

రాష్ట్రంలో ఎస్ఐఆర్ గడువు పొడిగిస్తూ ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ విజ్ఞప్తితో గడువు పొడిగించింది. దీంతో క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ కోసం అక్టోబర్ 7 వరకు అవకాశం ఉంటుంది. నవంబర్ 9న తుది ఓటరు జాబితా ప్రచురిస్తారు. ప్రస్తుతం పరిస్థితుల్లో ఓటర్లు, అధికారులకు ఇదో పెద్ద ఉపసమనంగా భావిస్తున్నారు. మొదటి నుంచి గందరగోళంగానే

(మిగతా 2వ పేజీలో..)




## కార్పొరేషన్లలోనూ ఇందిరమ్మ టవర్స్

### గుడిసెలు లేని తెలంగాణే లక్ష్యం

### ఇందిరమ్మ ఇళ్లకు కేంద్రం నుంచి ఆశించిన సహకారం లేదు

### శాసనమండలిలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబర్ 07 :**

గ్రామీణ ప్రాంతాల్లో పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్నట్లుగానే పట్టణ ప్రాంతాల్లో నివసించే పేదల సొంతింటి కలను కూడా సాకారం చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లపై శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ.. స్థలాల కొరతను దృష్టిలో ఉంచుకుని జీహెచ్ఎంసీ పరిధిలో నిర్మిస్తున్న ఇందిరమ్మ టవర్స్ తరహాలోనే నల్గొండ, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్ తదితర మున్సిపల్ కార్పొరేషన్లలోనూ ఇందిరమ్మ టవర్స్ నిర్మిస్తామని వెల్లడించారు.

గుడిసె లేని తెలంగాణే లక్ష్యం

రాష్ట్రంలో గుడిసెల్లో నివసిస్తున్న కుటుంబాలను గుర్తించి, గుడిసెలు లేని తెలంగాణ

(మిగతా 2వ పేజీలో..)



## ఇరాన్ ప్రయోజనాలు, భద్రతపై జరిగే ఏ దాడికైనా వేగవంతమైన తీవ్ర ప్రతిస్పందన ఉంటుంది

### అమెరికా దాడులపై ఇరాన్ హెచ్చరిక

టెహ్రాన్ : అమెరికా ఆంక్షల కారణంగా ఎదురైన సమస్యలను పరిష్కరించుకు నేందుకు ప్రయత్నాలను ముమ్మరం చేస్తామని ఇరాన్ తెలిపింది. తనపై మరిన్ని దాడులు జరిపితే 'బాధాకరమైన ప్రతిస్పం దన' తప్పదని హెచ్చరించింది. చమురు ట్యాంకర్లపై అమెరికా జరిపిన తాజా దాడుల నేపథ్యంలో ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాఖర్ ఖలీబఫ్ మాట్లాడుతూ ఆట నియమాలు మారిపోయాయని మరీ ఆలస్యం కాకముందే అమెరికా గ్రహించాలని వ్యాఖ్యానించారు. ఇకపై ఇరాన్ ప్రయో జనాలు, భద్రతపై జరిగే ఏ దాడికైనా వేగవంతమైన, తీవ్రమైన, బాధాకరమైన ప్రతిస్పందన ఉంటుందని తన టెలిగ్రామ్ ఛానల్‌లో ప్రచురించిన ప్రసంగంలో చెప్పారు. అమెరికాతో సైనిక పోరాటం జరపడంతో పాటు ప్రధానంగా ఉత్పత్తి, ప్రజల జీవనోపాధి కోసం తాము పోరు సాగించాల్సి ఉంటుందని అన్నారు. కరెన్సీలో తీవ్రమైన హెచ్చుతగ్గులు, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, మార్కెట్ నిర్వహణ వంటివి తమ ముందు ఉన్న ప్రధాన సవాళ్లని తెలిపారు. ఇరానీయులు

(మిగతా 2వ పేజీలో..)



## స్పీకర్‌పై ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత వ్యాఖ్యలు

### ముక్తకంఠంతో ఖండించిన శాసనసభ

### మధు సభ్యత్వాన్ని రద్దు చేయాల్సిందే : సీఎం, స్పీకర్, మండలి చైర్మెన్‌కు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఫిర్యాదు

### సభ్య సమాజానికే అవమానకరం: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

### గాంధీ భవన్‌లో కాంగ్రెస్ నిరసనలు

### నల్లచొక్కాలతో సభకు బీఆర్ ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

### అడ్డుకున్న పోలీసులు.. నేతల వాగ్వాదం

### కేటీఆర్, హరీశ్‌రావు సహా పలువురి అరెస్టు

**హైదరాబాద్, సెప్టెంబర్ 07**

అసెంబ్లీ వర్షాకాల సమావేశాల తొలిరోజే సభ భగ్గుమంది. నల్ల టీషర్టులు ధరించి సభకు హాజరయ్యేం దుకు బీఆర్ ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రయత్నించే క్రమంలో మొదలైన ఉద్రిక్త పరిస్థితి... అసెంబ్లీ వాయిదా పడే వరకూ కొనసాగింది. ఈ క్రమంలో ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్సీ తాతా మధు... ఉద్రేకంగా మాట్లాడు

(మిగతా 2వ పేజీలో..)



హంస కలం వార్త

## నల్లదుస్తులతో బీఆర్ఎస్ నిరసన

(మొదటి పేజీ తరువాయి)

ప్రాంతాల్లో ఎక్కడికక్కడా వాహనాలు నిలిచిపోవడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. అయితే టీషర్ట్ విప్పి లోపలికి వెళ్తామని మాజీ మంత్రి హరీశ్ రావుతోపాటు పలువురు నేతలు టీషర్టులు తీసేశారు. బనియన్ పైనే లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. అయినా పోలీసులు వారిని అడ్డుకోవడంతో తీవ్ర గందరళగోళం నెలకొంది. పెద్దఎత్తున మోహరించిన పోలీసులు, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు సహా పలువురు ప్రజాప్రతినిధులను అరెస్టు చేశారు. అసెంబ్లీ గేటు వద్ద జరిగిన తోపులాటలో హరీశ్ రావు, జగదీశ్‌రెడ్డి కింద పడిపోయారు. కేటీఆర్ తో పాటు పలువురు నేతలను పోలీసులు అరెస్టు చేసే క్రమంలో వారికి గాయాలయ్యాయని తెలిసింది. అరెస్టు అనంతరం నేతలను తెలంగాణ భవన్‌కు తరలించారు. ఇదిలావుండగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి చీరను పోలీసులు లాగారంటూ బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. అలాగే, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి జుట్టు పట్టుకుని నెట్టారంటూ ఆరోపించారు. పోలీసుల తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విషయం తెలిసిన వెంటనే హైదరాబాద్ సీపీ సజ్జనార్ అసెంబ్లీ వద్దకు చేరుకున్నారు. మహిళా ఎమ్మెల్యే చీర లాగిన అంశంపై పోలీస్ సిబ్బంది నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇదే అంశంపై ఖైరతాబాద్ జోన్ డీసీపీ శిల్పవల్లి స్పందించారు. అసెంబ్లీకి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు బ్లాక్ టీషర్ట్‌లు వేసుకురావడం నేరం కాదని, అయితే వాటిపైన అభ్యంతకర పదాలు ఉండటంతో లోపలికి అనుమతించలేదని వివరించారు. తాము ఎవ్రితోనూ అసభ్యకరంగా ప్రవర్తించలేదన్నారు. అలాంటిది ఏమైనా ఉంటే వీడియోలు చూసి పరిశీలిస్తామని చెప్పారు. బీఆర్ఎస్ ఆరోపణలను పరిశీలిస్తామన్నారు. అసెంబ్లీ స్పీకర్ సూచన మేరకు తాము నడుచుకుంటున్నట్టు డీసీపీ చెప్పారు.

అడ్డగోలు హామీలతో అధికారం లోకి కాంగ్రెస్ : కేటీఆర్, హరీశ్‌రావు

కాంగ్రెస్ సర్కార్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. గన్‌పార్క్ వద్ద మీడియాతో మాట్లాడుతూ.. అడ్డగోలు హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, సబండ వర్గాలను మోసం చేసిందని విమర్శించారు. వంద రోజుల్లో హామీలు అమలు చేస్తామని 420 హామీలు ఇచ్చారని తెలిపారు. ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్ని రకాలుగా సభలో అవమానించినా ప్రజల కోసం హామీల అమలుపై ప్రశ్నించాలని తమ అధినేత సూచించినట్టు తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ కుట్రలు కొత్త కాదని, గతంలో ఎన్నో చూశామన్నారు. 22 ఏ ద్వారా ప్రజల ఆస్తులను నిషేధిత జాబితాలో పెట్టిన ఈ ప్రభుత్వాన్ని ప్రజలే నిషేధిస్తారని హెచ్చరించారు సీఎం, మంత్రుల బంధువులకు అక్రమంగా భూ కేటాయింపులు చేస్తున్నారని ఆరోపించారు. గన్‌పార్క్ వద్ద అమరవీరుల స్థూపానికి నివాళులర్పించిన అనంతరం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అసెంబ్లీకి ర్యాలీగా బయలుదేరారు.

## సర్ గడువు పొడిగింపు

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణలో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (సర్) మొదటి నుంచి గందరగోళంగా ఉంది. ఎన్యూమరేషన్ సమయంలోనే అనేక ఇబ్బందులు తలెత్తగా, ప్రస్తుతం నోటీసుల ప్రక్రియ కూడా అలానే సాగుతోంది. బీఎల్వోల అవగాహన లోపం, నిర్లక్ష్యం అనేక చోట్ల కనిపిస్తోంది. దీంతో అభ్యంతరాలు, క్లెయిమ్ల స్వీకరణ కూడా మందకొడిగా సాగుతోంది. ఇంటింటికి వెళ్లి ఓటర్లకు నోటీసులు అందిం చాలని ఎన్నికల సంఘం స్పష్టమైన ఆదేశాలు ఇస్తున్నా, క్షేత్రస్థాయి సిబ్బంది మాత్రం, కొన్ని చోట్ల నోటీసులు నేరుగా అందిస్తూ, మరికొన్ని చోట్ల ఫోన్ చేసి నోటీసులు తీసుకెళ్లాలని చెబుతున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నా యి. దీనికి తోడు ప్రజల్లోను అవగాహన లోపం కనిపిస్తోంది. కొన్ని చోట్ల భారీగా నోటీసులు జారీ చేసింది. చాలా తక్కువ మంది మాత్రమే హియరింగ్కు హాజరవుతున్నారు.

బీఎల్వోల నిర్లక్ష్యం

విచారణ తేదీ నాటికి వారం రోజుల ముందుగానే ఓటర్లకు నేరుగా నోటీసులు ఇవ్వాల్సి ఉన్నా, బీఎల్వోలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో పాటు నోటీసులకు బదులిచ్చేందుకు ఏయే డాక్యుమెంట్స్ అవసరమో, ఓటర్లకు సరైన అవగాహన లేకపోవడమూ గందరగోళానికి కారణంగా తెలుస్తోంది. దీంతో విచారణకు కూడా హాజరుకావడం లేదని సమాచారం. 47.79 లక్షల మందికి నోటీసులు జారీ ఇప్పటికి 47.79 లక్షల మందికి నోటీసులు జారీ అయ్యాయి. అయితే అందులో ఏకంగా 32 లక్షల మంది నుంచి సమాధానం రాలేదని తెలుస్తోంది. దీంతో వారికి మరోసారి నోటీసులు ఇస్తున్నారు. ఓటర్ల ఫైనల్ లిస్టో పేరు ఉండాలంటే కచ్చితంగా నోటీసులకు సమాధానం ఇవ్వాలని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

## మహిళలను కించపరిచేలా వ్యాఖ్యలు చేస్తే చర్యలు తప్పవు : సీఎం విజయ్

(మొదటి పేజీ తరువాయి)

పరిరక్షణకు పోలీసులు మరింత సమర్థంగా పనిచేయాలని విజయ్ అన్నారు. నేరాలు జరిగిన తర్వాత నిందితులను అరెస్టు చేయడం కంటే.. నేరాలు జరగకుండా ముందుగానే నిరోధించడమే పోలీసుల ప్రధాన బాధ్యత కావాలని పేర్కొన్నారు. చట్టాన్ని పాటించే ప్రజలకు పోలీసులు మిత్రులుగా, ఉల్లంఘించేవారికి కఠినంగా వ్యవహరించాలని సూచించారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల విషయంలో చర్యలు చేపట్టడంలో తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. అవినీతిపై జీరో టాలరెన్స్ విధానాన్ని అమలు చేస్తున్నామని, ప్రభుత్వ ఉద్యోగులు లంచాలు, అవినీతికి దూరంగా ఉండాలని హెచ్చరించారు. పోలీసులపై ఆరోపణలు వచ్చినా వారిని కాపాడే ప్రసక్తి లేదని, లాకప్ నేరాలపై పారదర్శక దర్యాప్తు చేపడతామని హెచ్చరించారు.

## ఇరాన్ ప్రయోజనాలు, భద్రతపై జరిగే ఏ దాడికైనా వేగవంతమైన తీవ్ర ప్రతిస్పందన ఉంటుంది

(మొదటి పేజీ తరువాయి)

కష్టాలను సహించ గలరని, కానీ దుర్వినియోగాన్ని సహించబోరని, ప్రభుత్వం త్వరగా చర్యలు తీసుకోవాలని కోరుకుంటారని చెప్పారు.రాబోయే రోజులలో హోర్ముజ్ జలసంధి వెలుపల ఆంక్షలతో కూడిన మండలాన్ని ప్రకటిస్తామని ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శి మొహ్‌సేన్ రెజాయి తెలిపారు. ఈ మండలంలో గల్ఫ్‌లోని ప్రాంతాలు కూడా ఉంటాయని, అందులో ప్రవేశించే ఏ నౌకనైనా ఆంక్షల జాబితాలో చేరుస్తామని చెప్పారు. కాగా అమెరికా ఆర్థిక ఒత్తిడికి సంస్కరణలతో ప్రతిస్పందించాలని అనుకుంటున్నామని ఇరాన్ ఆర్థిక మంత్రి అలీ మదానీజాదే తెలిపారు. ఆంక్షల కారణంగా తమ వైఖరి మారబోదని ఆయన స్పష్టం చేశారు.

# తెలంగాణకు చీకటిరోజు

(మొదటి పేజీ తరువాయి)

ముక్తకంఠంతో ఖండించాలని అన్నారు. అసహ్యకరమైన, జుగుప్సాకరమైన భాషను వాడారని చెప్పారు. ప్రజాప్రతినిధులు వాడే భాషపై చర్చించాలన్నారు. రాజకీయాలకతీతంగా స్పందించాలని కోరారు. ఇలాంటి దుర్మార్గపు పోకడలను నియంత్రించాలని చెప్పారు. ప్రభుత్వం సంయమనం పాటిస్తే దాన్ని చాతకానితనంగా అనుకుంటున్నారని అన్నారు. అదిరించి బెదిరించి వ్యవస్థలను లొంగదీసుకోవాలని అనుకుంటూ చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఈ ఘటనపై కేసీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తాతా మధుతో రాజీనామా చేయించాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఆ సభ్యుడిని డిస్మిస్ చేయాలన్నారు. శాసనమండలి చైర్మెన్ ఆసభ్యుడిని బర్తరఫ్ చేయాలని కోరారు.

తాతా మధు వెనుక కేసీఆర్ : అడ్లూరి

తాతా మధు వ్యాఖ్యల వెనుక కేసీఆర్ ఉన్నారని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. తాతా మధుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలనీ, సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజాస్వామ్యానికి తీరని మచ్చ : మహేశ్వర్‌రెడ్డి

స్పీకర్‌పై మాట్లాడిన వ్యాఖ్యలను బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఖండించారు. ఈ ఘటనకు బాధ్యత వహించి కేసీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి తీరని మచ్చ అని అన్నారు. ఆ సభ్యుడిని బర్తరఫ్ చేయాలని కోరారు.

ఎంఐఎం ఖండన

స్పీకర్‌పై తాతా మధు చేసిన వ్యాఖ్యలను ఎంఐఎం సభ్యులు అహ్మద్‌బిన్ అబ్దుల్లా బలాలా ఖండించారు.

కేసీఆర్‌కు దళితులపై ప్రేమలేదు : కడియం

బీఆర్ఎస్‌కు, కేసీఆర్‌కు దళితులకు నిజంగా ప్రేమలేదని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. రాజ్యాంగ పరంగా వచ్చే రిజర్వేషన్లను అమలు చేయాలి కాబట్టే దళితులు, గిరిజనులకు గౌరవం ఇస్తున్నారని చెప్పారు.

# స్పీకర్‌పై ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత వ్యాఖ్యలు

(మొదటి పేజీ తరువాయి)

తూ స్పీకర్ ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేయటంతో ఇటు శాసనసభ లోపల, బయటా పరిస్థితి హీటెక్కింది. దళితుడైన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై దుర్భాషలాడిన మధును తక్షణమే మండలి నుంచి సస్పెండ్ చేయాలంటూ అధికార కాంగ్రెస్ పట్టుబట్టింది. ఇది మొత్తం సభ్య సమాజానికే అవమానకరమని సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనతోపాటు మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్క, అడ్లూరి లక్ష్మన్ కుమార్, జూపల్లి కృష్ణారావు, వివేక్ వెంకట స్వామితోపాటు బీజేపీ, ఎంఐఎం సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఒకానొక దశలో సీతక్క భావోద్వేగానికి గురికాగా.. స్పీకర్ కంటతడిపెట్టారు. తొలుత సోమవారం ఉదయం సభ ప్రారంభానికి ముందు బీఆర్ ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్‌రావు సహా మిగతా సభ్యులందరూ గన్ పార్కు వద్ద అమరవీరుల స్థూపానికి నివాళులర్పిం చారు. నల్ల టీషర్టులు ధరించిన వారందరూ అసెంబ్లీ ప్రధాన ద్వారం నుంచి లోపలికి వెళ్లేందుకు ఉద్యుక్తుల య్యారు. వారు ధరించిన టీ షర్టులపై ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని అని రాసుంది. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేసిన పోలీసులు బీఆర్ ఎస్ ఎమ్మెల్యేలను అడ్డుకోవటంతో అక్కడ తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. కేటీఆర్, హరీశ్‌రావు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఈ దశలో తాతా మధు... స్పీకర్‌ను ఉద్దేశించి నోరు జారటంతో పరిస్థితి అదుపు తప్పింది. సీసీ కెమెరాల్లో దృశ్యాలతోపాటు వాయిస్ కూడా రికార్డు కావటంతో... ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఇదే అంశాన్ని సభలో సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తావించారు. మధు లాంటి వారిపై ఇప్పుడు వేటు వేయకపోతే... భవిష్యత్తు క్షమించబోదని హెచ్చరించారు. మరోవైపు మధు శాసనమండలి సభ్యత్వాన్ని రద్దు చేయాలంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు... సీఎం రేవంత్ రెడ్డికి, మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను పరామర్శించి, సంఘీభావం తెలిపారు. కాగా అసెంబ్లీ ప్రధాన ద్వారం వద్ద తమపట్ల ప్రభుత్వం, పోలీసులు అనుసరించిన తీరుపై బీఆర్ ఎస్... రాష్ట్రవ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చింది. మంగళవారం ఆ మేరకు అన్ని జిల్లాల్లో కార్యక్రమాలను చేపట్టాలని విజ్ఞప్తి చేసింది. మరోవైపు గాంధీ భవన్‌లో కాంగ్రెస్ శ్రేణులు తాతా మధు దిష్టిబొమ్మను దహనం చేశాయి. మొత్తం మీద వర్షాకాల సమావేశాల తొలిరోజు శాసనసభలో ప్రజా సమస్యలు పూర్తిగా పక్కకుపోయాయి. మరి రెండో రోజైన మంగళవారమైనా సభ సజావుగా సాగుతుందా? లేక ఇదే అంశాలపై మళ్లీ రగడ మొదలవుతుందా? అనేది వేచి చూడాలి.

# కార్పొరేషన్లలోనూ ఇందిరమ్మ టవర్స్

(మొదటి పేజీ తరువాయి)

నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వడంతో పాటు పొదుపు మహిళా సంఘాల ద్వారా రూ.లక్ష వరకు అడ్వాన్స్ రుణం అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కేంద్రం నుంచి ఒక్క ఇల్లు కూడా మంజూరు కాలేదు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కేంద్రం నుంచి ఆశించిన స్థాయిలో సహకారం అందడం లేదని మంత్రి పేర్కొన్నారు. దేశంలోని ఇతర రాష్ట్రాలకు గ్రామీణ ప్రాంతాల్లో లక్షలు, రెండు లక్షల ఇళ్లు మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వం.. తెలంగాణకు మాత్రం ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయలేదని అన్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను తాను, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పలుమార్లు కలిసి తెలంగాణకు గృహాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేసినప్పటికీ ఇప్పటివరకు ఆశించిన స్పందన రాలేదన్నారు.

దసరా నాటికి 2 లక్షల ఇళ్లు పూర్తి

రాష్ట్రంలో తొలి విడతలో రూ.22,500 కోట్లతో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని మంత్రి తెలిపారు. ఇందులో 3,75,750 ఇళ్లకు కలెక్టర్లు లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారని, 3,28,070 ఇళ్లు గ్రౌండ్ అయినట్లు వెల్లడించారు. ఇప్పటివరకు 1,97,537 ఇళ్లు పూర్తయ్యాయని, దసరా నాటికి 2 లక్షల ఇళ్లను పూర్తి చేస్తామని ప్రకటించారు.

ఈ నెల 20లోగా రెండో విడత ఇళ్ల మంజూరు

రెండో విడతలో నియోజకవర్గానికి 2,000 చొప్పున 2.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని మంత్రి తెలిపారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఇళ్లను మంజూరు చేసినప్పటికీ వివిధ దశల్లో నిర్మాణాలు నిలిచిపోయిన ఇళ్లకు ఈ విడతలో ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఈ నెల 20వ తేదీలోగా రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియను పూర్తి చేస్తామని మంత్రి స్పష్టం చేశారు.

రూ.230కే సిమెంట్.. త్వరలో రాయితీపై స్టీల్

పేదల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లకు రూ.230కే సిమెంట్ బస్తాలను రాయితీపై సరఫరా చేస్తున్నామని మంత్రి తెలిపారు. త్వరలో పరిశ్రమల శాఖ మంత్రితో కలిసి స్టీల్ పరిశ్రమల యజమానులతో సమావేశం నిర్వహించి, రాయితీపై స్టీల్ అందించేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

అసంపూర్తి 2 బీహెచ్‌కే ఇళ్లకు పూర్తి

గత ప్రభుత్వ హయాంలో వివిధ కారణాలతో నిలిచిపోయిన అసంపూర్తి 2బీహెచ్‌కే ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందిస్తున్నామని మంత్రి తెలిపారు. ఆయా కాలనీల్లో అవసరమైన మౌలిక వసతులను కూడా కల్పిస్తున్నామని పేర్కొన్నారు. పేదలకు ఇల్లు అంటే కేవలం నాలుగు గోడలు కాదు.. అది ఆత్మగౌరవానికి ప్రతీక. గుడిసె లేని తెలంగాణను నిర్మించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.

## రాష్ట్రాన్ని పెట్టుబడుల గమ్యస్థానంగా మారుస్తాం

### గ్లోబల్ సమ్మిట్‌పై సమీక్షలో సీఎస్ సంజయ్ జాజు

**హైదరాబాద్, సెప్టెంబర్ 07 :**

'ఇన్వెస్ట్ తెలంగాణ' పేరుతో నిర్వహించనున్న ఈ గ్లోబల్ సమ్మిట్ ద్వారా తెలంగాణలోని పెట్టుబడి అవకాశాలను ప్రపంచానికి విస్తృతంగా పరిచయం చేయడంతో పాటు రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయి పెట్టుబడుల గమ్యస్థానంగా మరింతగా ప్రతిష్టించేందుకు కృషి చేయాలని సీఎస్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించి సన్నాహకాలను సమీక్షించారు. రానున్న ఇన్వెస్ట్ తెలంగాణ -- తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2026 నిర్వహణకు సంబంధించి చర్చించారు. గ్లోబల్ సమ్మిట్‌కు దేశ, విదేశాల నుంచి ప్రముఖులు, అంతర్జాతీయ పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు, వివిధ రంగాల ప్రతినిధులు, సీఈఓలు, సీఎక్స్ఓలు, దౌత్యవేత్తలు తదితరులను పెద్ద సంఖ్యలో ఆహ్వానించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమ్మిట్‌కు హాజరుకావాల్సిందిగా ప్రముఖులకు ఈ-మెయిల్స్ ద్వారా అధికారిక ఆహ్వానాలు పంపే ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని సూచించారు.సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ఆహ్వానితుల జాబితాను సిద్ధం చేసి, ఆహ్వానాల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. తెలంగాణలోని ఫ్యూచర్ సిటీ, ఐటీ, ఏఐ, ఫార్మాస్యూటికల్స్, డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, క్లీన్ ఎనర్జీ, అధునాతన తయారీ రంగాలు, మౌలిక వసతులు, ఆవిష్కరణలు తదితర రంగాల్లో ఉన్న అవకాశాలను సమ్మిట్ ద్వారా ప్రపంచ



పెట్టుబడిదారులకు సమర్థవంతంగా ప్రదర్శించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. గ్లోబల్ సమ్మిట్‌ను ప్రతిష్టాత్మకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో సమయపాలనతో కూడిన కార్యాచరణను అమలు చేయాలని సీఎస్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సీనియర్ అధికారులు కృష్ణ ఆదిత్య, అజిత్ రెడ్డి, అనుదీప్ దురిశెట్టి, నిఖిల్ చక్రవర్తి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నట్టు సమాచార పౌర సంబంధాల శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

హంస కలం వార్త



# సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదల పాలిట వరం లాంటిది జీపీ పల్లి మాజీ సర్పంచ్ నరేందర్



**మేడ్చల్, సెప్టెంబర్ 07, హంసకలం వార్త**

సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదల పాలిట వరం లాంటిందని గుండ్లపోచంపల్లి మాజీ సర్పంచ్ బండారి నరేందర్, మాజీ కౌన్సిలర్ ఎస్. శ్రీనివాస్ పేర్కొన్నారు. గుండ్లపోచంపల్లి 299 డివిజన్ పరిధిలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన చెక్కులను సోమవారం వారు లబ్ధిదారులకు అందజేశారు. డివిజన్ పరిధికి చెందిన పీ. సాయికుమార్, బొక్క మౌనిక ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. వైద్యానికి తమ తాహతుకు మించి ఖర్చు కావడంతో ఆర్థిక సాయాన్ని అర్జిస్తూ సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. దింతో మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో మంది పేదలకు వరంలాగా మారిందన్నారు. ప్రతి పేదవాడికి కొండంత ఆసరాగా నిలిచే ముఖ్యమంత్రి సహాయ నిధిని ప్రతి ఒక్కరు ఆపదలో ఉన్నప్పుడు వినియోగించుకోవాలని వారు సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎప్పుడు పేద మధ్యతరగతి ప్రజల పక్షపాతిగా ఉన్నారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యంలో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని చెప్పారు. ఈ సందర్భంగా వారు బొక్క మౌనికకు రూ. 23 వేల 500, సాయికుమార్ కు రూ. 45 వేలు మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కుండ భానుచందర్, సంపత్ గౌడ్, కావలి భాస్కర్, ఆలయ కమిటీ డైరెక్టర్లు ఉదయ్ గౌడ్, అనిల్ ముదిరాజ్, సోను, షబ్బీర్, నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ సర్కార్ 1000 రోజుల పాలన వైఫల్యాలపై మేడ్చల్ బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో ప్రజావాణిలో ఫిర్యాదులు



**మేడ్చల్, సెప్టెంబర్ 06,హంసకలం వార్త:**

కాంగ్రెస్ సర్కార్ వెయ్యి రోజుల విధ్వంస పాలన వైఫల్యాలపై బీఆర్ఎస్ అధిష్టానం పిలుపు మేరకు వారం రోజుల నిరసన కార్యక్రమాల్లో భాగంగా సోమవారం ఆరవ రోజు మేడ్చల్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు నిరసన ప్రదర్శన చేపట్టి ప్రజావాణి కార్యక్రమంలో తహశీల్ కార్యాలయంలో అధికారులకు ఫిర్యాదులు చేశారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను వంద రోజుల్లో అమలు చేస్తామని వాగ్దానం చేసి వెయ్యి రోజులైన నెరవేర్చకపోవడంతో నిరసనగా సైబరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ మేడ్చల్ నాయకులు భారీ ప్రదర్శన చేపట్టి తహశీల్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదులు సమర్పించారు. అంతకు ముందు తెలంగాణ సిద్ధాంతకర్త కొత్తపల్లి జయశంకర్ విగ్రహానికి వినతులు సమర్పించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ బాసురాది భాస్కర్ యాదవ్, ఎల్లంపేట మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీదేవి రమేశ్ మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కార్ ఏర్పడి వెయ్యి రోజులు పూర్తయిన ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలు అమలు చేయకపోవడం దుర్మార్గమని విమర్శించారు. ఎన్నికల సమయంలో అలవి కాని హామీలతో ప్రజలను నమ్మించి గొంతు కోశారని, అరచేతిలో స్వర్గం చూపించారని అధికార దాహంతో నోటికొచ్చిన హామీలిచ్చిప్రజలను దగా చేశారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో నాయకులు సద్ది నిశితా రెడ్డి, నవీన్ రెడ్డి, దయానంద్ యాదవ్, ఒగ్గు శంకర్, రఘుపతి రెడ్డి, శైలేందర్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలన అవినీతి మయం: సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి







**కాప్రా సర్కిల్, సెప్టెంబర్ 07, హంసకలం వార్త**

తెలంగాణలో కాంగ్రెస్ పాలన పూర్తిగా అవినీతిలో కూరుకుపోయిందని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. అసెంబ్లీ వద్ద ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలను, నాయకులను అడ్డుకోవడాన్ని నిరసిస్తూ కాప్రా సర్కిల్ కార్యాలయం ముందు బైఠాయించి ధర్నాకు దిగారు బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో అన్ని డివిజన్ల నాయకులు, కార్యకర్తలతో కలిసి కాప్రా సర్కిల్ డీసీకి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సోమశేఖర్ రెడ్డి మాట్లాడుతూ కాప్రా సర్కిల్ అధికారులు అధికార పార్టీకి, బీజేపీకి వంతపాడుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ ఫ్లెక్సీలు కావాలనే తీసేస్తున్నారని అదే సమయంలో కాంగ్రెస్, బీజేపీ ఫ్లెక్సీల వైపు కూడా చూడటం లేదన్నారు. తెలంగాణ తెచ్చిన కేసీఆర్ ను రాజీనామా చేయమంటున్నారని కేసీఆర్ కు ఆరోగ్య సమస్యల వల్ల అసెంబ్లీకి రాకపోతే ఇంత రాద్ధాంతం చేస్తారా అని ప్రశ్నించారు. అలా అయితే ఏపీలో చంద్రబాబు నాయుడు, తమిళనాడులో జయలలిత కూడా వివిద కారణాల కారణంగా అసెంబ్లీకి వెళ్లలేదని గుర్తు చేశారు. 1000 రోజుల కాంగ్రెస్ పాలన అట్టర్ ఫ్లాప్ అయిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మల్కాజిగిరి ఎంపీగా ఉన్నప్పుడు ఏనాడు పార్లమెంట్ పరిధిలో అడుగుపెట్టి అభివృద్ధి చేయలేదని ఎద్దేవా చేశారు. తెలంగాణలో పేదల భూములను 22ఏ కింద నిషేధిత భూముల జాబితాలో చేర్చి భారీ అవినీతికి తెరలేపారన్నారు. ప్రజలు తమ భూములను నిషేధిత జాబితా నుండి తొలగించుకోవడానికి అధికారుల చుట్టూ తిరుగుతున్నారని, అధికారులు ఒక్కొక్కరి వద్ద నుండి లక్ష రూపాయల వరకు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కోటి ఎకరాల భూములను నిషేధిత జాబితాలో చేర్చి లక్షకోట్ల భారీ కుంభకోణానికి తెరలేపిందని సోమశేఖర్ రెడ్డి ఆరోపించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాప్రా సర్కిల్ కార్యాలయం ముందు ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. పోలీసులు ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేసి కుషాయిగూడ పోలీసు స్టేషన్ కు తరలించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, ప్రభుదాస్, కాసం మహిపాల్ రెడ్డి, నవీన్ గౌడ్, రమేష్ చారి, షేర్ మణెమ్మ, శ్రీనివాస్ గౌడ్, రహీంతో పాటు అన్ని డివిజన్ల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## మహనీయుల విగ్రహాలకు అపచారం.. పట్టించుకోని మున్సిపల్ యంత్రాంగం

- మాజీ వార్డు సభ్యులు బండకింది ప్రసాద్ గౌడ్



**జవహర్‌నగర్, సెప్టెంబర్ 7 హంసకలం వార్త**

మహనీయుల విగ్రహాలు నేటి యువతకు స్ఫూర్తి ప్రదాతలు. వారి త్యాగాలను, దేశానికి చేసిన సేవలను భావితరాలకు గుర్తుచేస్తూ విగ్రహాలు ఏర్పాటు చేస్తారు. అయితే ఆ విగ్రహాల పరిసరాలను పరిశుభ్రంగా, పవిత్రంగా ఉంచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో భారతదేశ తొలి మహిళా ప్రధానమంత్రి, దివంగత శ్రీమతి ఇందిరా గాంధీ విగ్రహం వద్ద నెలకొన్న దుస్థితి అందరినీ కలచివేస్తోంది. విగ్రహం పరిసరాల్లో ఇష్టానుసారంగా చెత్తను పారబోస్తున్నారు. చెత్త కుప్పలతో ఆ ప్రాంతం అపరిశుభ్రంగా మారి దుర్గంధం వెదజల్లుతోంది. ఈ విషయంపై స్థానికులు పలుమార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయం. మహనీయుల విగ్రహాలు గౌరవానికి, ఆదర్శానికి ప్రతీకలు. అలాంటి ప్రదేశాన్ని ఇలా చెత్తకుప్పగా మార్చడం ఆ మహనీయురాలిని అవమానించినట్లేనని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జవహర్‌నగర్ మున్సిపల్ కమిషనర్ వెంటనే స్పందించి, ఇందిరా గాంధీ విగ్రహం పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి, ఆ ప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే ప్రజలు కూడా బాధ్యతగా వ్యవహరించి విగ్రహాల వద్ద చెత్త వేయకుండా, స్వచ్ఛ జవహర్‌నగర్‌గా తీర్చిదిద్దడంలో సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన బీజేపీ నాయకులు జల్లి శైలజ హరినాథ్, రాగం అర్జున్

**మేడ్చల్, సెప్టెంబర్ 07, హంసకలం వార్త :**

రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ తాతా మధు అసభ్య పదజాలంతో, అనుచితంగా వ్యాఖ్యలు చేయడాన్ని మేడ్చల్ డివిజన్ బీజేపీ అధ్యక్షురాలు జల్లి శైలజ హరినాథ్, మేడ్చల్ జిల్లా (బీజేవైఎం) అధ్యక్షుడు రాగం అర్జున్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వారు సోమవారం మాట్లాడుతూ ఉన్నత పదవుల్లో దళితులు కనిపిస్తే ఓర్వలేని మనస్తత్వం కొందరిలో ఇప్పటికీ కొనసాగుతుండటం అత్యంత బాధాకరమని మండిపడ్డారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు దాటినా సమాజంలో దళితుల పట్ల వివక్ష, అంటరానితనం, కుల అహంకార భావజాలం కొనసాగించడం అత్యంత హేయమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి వ్యాఖ్యలు సమాజంలో విభేదాలను రెచ్చగొట్టడమే కాకుండా, రాజ్యాంగం కల్పించిన సమానత్వ హక్కులను అవమానించడమేనని వారు పేర్కొన్నారు. రాజ్యాంగబద్ధమైన అత్యున్నతమైన తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ పదవిలో ఒక దళిత బిడ్డ ఉండటాన్ని జీర్ణించుకోలేక, కులం కోణంలో చూస్తూ పరుష పదజాలంతో అవమానించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని వారు పేర్కొన్నారు. ప్రజల ఓట్లతో ఎన్నికై, రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న వ్యక్తిపై వ్యక్తిగత దూషణలకు పాల్పడటం ప్రజాస్వామ్య వ్యవస్థను కించపరచడమేనని వారు ధ్వజమెత్తారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న అనుచిత వ్యాఖ్యలు కేవలం ఒక వ్యక్తిపై చేసిన దాడి మాత్రమే కాదని, సమస్త దళిత సమాజం ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ప్రయత్నమని స్పష్టం చేశారు. కులం, మతం, ప్రాంతం పేరుతో ఎవరినీ అవమానించే హక్కు ఎవరికీ లేదని వారు హెచ్చరించారు. ఇలాంటి వ్యాఖ్యలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని వారు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని వారు పిలుపునిచ్చారు.

## సర్వే నెం. 455 లో ప్రభుత్వ భూమిని పరిరక్షించండి....జిల్లా కలెక్టర్, ఆర్డీవో లకు రాంపల్లిదాయర గ్రామస్తుల వినతి

**కీసర, సెప్టెంబర్07,హంసకలం వార్త**

మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, కీసర మండలం, రాంపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నెం. 455లో ఉన్న విలువైన ప్రభుత్వ భూమిని అక్రమ ఆక్రమణదారుల నుంచి కాపాడాలని కోరుతూ రాంపల్లిదాయర గ్రామస్తులు సోమవారం జిల్లా కలెక్టర్ మను చౌదరి, కీసర ఆర్డీవో నల్ల వెంకట్ రెడ్డి లకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, సర్వే నెం. 455లోని ప్రభుత్వ భూమిని సర్వే చేసి, సరిహద్దులు గుర్తించాలని కోరుతూ గతంలో 2025 ఏప్రిల్ 21న, అలాగే ఈ ఏడాది జూలై 27న ఉన్నతాధికారులకు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల ఉదాసీనతను ఆసరాగా చేసుకుని కొంతమంది అనధికార వ్యక్తులు ప్రభుత్వ స్థలంలోకి చొరబడి గదులు, ప్రహరీ గోడలు నిర్మిస్తూ భూమిని కబ్జా చేస్తున్నారని వారు ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికైనా యంత్రాంగం స్పందించి తక్షణ చర్యలు చేపట్టకపోతే విలువైన ప్రభుత్వ ఆస్తి శాశ్వతంగా అన్యాక్రాంతమయ్యే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సర్వే నెం. 455 లోని భూమికి సమగ్ర సర్వే నిర్వహించి, పక్కాగా హద్దులు నిర్ణయించాలని, అక్రమ నిర్మాణాలను తొలగించి ప్రభుత్వ భూమి ఖచ్చితమైన విస్తీర్ణాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేశారు.



జనరల్ న్యూస్

హంస కలం వార్త

## మేడ్చల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో 15 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులకు పరిష్కారం

**రూ. 25 వేల వరకు జరిమానా...**

**6 మందికి జైలు శిక్ష - ట్రాఫిక్ ఎస్ హెచ్ ఓ క్రాంతి కుమార్**

**మేడ్చల్, సెప్టెంబర్ 07, హంసకలం వార్త:**




మేడ్చల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో గత వారం పట్టుబడ్డ డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో 15 మంది నగదు జరిమానాతో పాటు 6 మంది మందు బాబులకు జైలు శిక్ష ఖరారైనట్లు ట్రాఫిక్ ఎస్ హెచ్ ఓ క్రాంతి కుమార్ తెలిపారు. సోమవారం సీఐ మాట్లాడుతూ గత వారాంతంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల సందర్భంగా (మద్యం తాగి వాహనం నడిపిన) 15 మందిపై నమోదైన కేసులను సోమవారం మేడ్చల్ లోని కోర్టు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, 7వ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో విచారణ నిమిత్తం హాజరుపరచగా న్యాయస్థానం విచారణ అనంతరం మొత్తం 15 మంది మందు బాబుల కేసులలో నేరానికి పాల్పడిన నిందితులకు రూ. 24 వేల 800 జరిమానా విధించడంతో పాటు 6 మందికి జైలు శిక్ష ఖరారు చేస్తూ తీర్పు వెలువరించినట్లు సీఐ వెల్లడించారు. మొత్తం 15 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు కావడంతో రూ. 24 వేల 800 జరిమానా విధించారు. 6 మందికి జైలు శిక్ష ఖరారు చేశారు. ఇద్దరికి 3 రోజుల సాధారణ జైలు శిక్ష, నలుగురికి 2 రోజుల సాధారణ జైలు శిక్ష విధించినట్లు సీఐ వివరించారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమ, నిబంధనలను కచ్చితంగా పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపడం వలన ప్రమాదాలు జరిగి ప్రాణ నష్టం జరుగుతుందని మేడ్చల్ ట్రాఫిక్ సీఐ క్రాంతి కుమార్ తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టపరంగా తీవ్ర పరిణామాలు ఉంటాయని, భారీ జరిమానాలతో పాటు జైలు శిక్ష తప్పదని ఈ సందర్భంగా సీఐ హెచ్చరించారు.

## గుండ్లపోచంపల్లి రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి పనులు షురూ

**మేడ్చల్, సెప్టెంబర్ 07,హంసకలం వార్త :**



గుండ్లపోచంపల్లి రైల్వే స్టేషన్ పరిధిలో మేడ్చల్ ప్రాంతానికి వెళ్ళడానికి ప్రజలకు సులభంగా ఉండేందుకు పనులకు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు సోమవారం "రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి" నిర్మాణ పనులకు భూమి పూజను నిర్వహించారు. త్వరలోనే సురక్షితమైన, వేగవంతమైన రవాణా సౌకర్యం అందరికీ అందుబాటులోకి రానుంది. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు పట్లోళ్ల విక్రమ్ రెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అమరం మోహన్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్, అమరం సరస్వతి మోహన్ రెడ్డి, బీజేపీ జీపి పల్లి డివిజన్ అధ్యక్షులు కావేరీ శ్రీధర్ ముదిరాజ్, బీజేపీ డివిజన్ ప్రధాన కార్యదర్శి చింతలపూడి రామారావు, బీజేపీ నాయకులు, మండల రవీందర్ గౌడ్, మలిగే అశోక్, బట్టికాడి నవనీత, బండారి సురేష్, ఉషిగారి నరేందర్, పలువురు రైల్వే అధికారులు, కాంట్రాక్టర్ తదితరులు పాల్గొన్నారు.

## హామీల అమలుపై కలెక్టరేట్ లో ఫిర్యాదు

**మాజీ మేయర్ మేకల కావ్య వినతి పత్రం అందజేసిన**

**జవహర్ నగర్, సెప్టెంబర్ 7 హంసకలం వార్త**



ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రకటించిన 6 గ్యారెంటీలు, 13 డిక్లరేషన్లతో పాటు 420 హామీలను సత్వరమే అమలు చేయాలని జవహర్ నగర్ మాజీ మేయర్ మేకల కావ్య జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే హామీలన్నీ నెరవేరుస్తామని ప్రకటించిన ప్రభుత్వం, వెయ్యి రోజులు దాటినా ఇప్పటివరకు ఏ ఒక్క హామీని పూర్తిగా అమలు చేయలేదని ఆమె పేర్కొన్నారు.మహాలక్ష్మి పథకం కింద మహిళలకు రూ.2500 నెలవారీ సాయం, తులం బంగారం, స్కూటీ పంపిణీ, రైతులకు రైతు భరోసా, కూలీలకు రూ.12 వేల సాయం, నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు, నిరుద్యోగులకు భృతి, జాబ్ క్యాలెండర్, విద్యార్థుల ఫీజు బకాయిల విడుదల, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, బీడీ కార్మికులకు రూ.4 వేల పింఛన్, ఆటో డ్రైవర్లకు రూ.12 వేల ఆర్థిక సాయంతో పాటు బీసీ, ఎస్సీ, మైనార్టీ డిక్లరేషన్లను అమలు చేసి తమ కుటుంబంలోని అర్హులకు న్యాయం చేయాలని కోరారు.జవహర్ నగర్ లో పారిశుధ్యం పూర్తిగా లోపించిందని, డంపింగ్ యార్డులో చెత్త పేరుకుపోయి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వెంటనే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. హామీలను నిలదీస్తున్న వారిపై అక్రమ కేసులు పెట్టడం సరికాదని, వాటిని ఆపాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో. మేడ్చల్ జిల్లా ఉద్యమకారుల ఫోరం అధ్యక్షులు జిట్టా శ్రీనివాస్ రెడ్డి. మాజీ కార్పొరేటర్ ఆలూరి సంగీత. మాజీ వార్డు సభ్యులు బండ కింది ప్రసాద్ గౌడ్. మైనార్టీ సెల్ నాయకులు అహ్మద్ పాషా. బీసీ సెల్ నాయకులు పంతంగి సిద్ధులు యాదవ్. నాయకులు. కూటి కంటి వెంకటేష్ గౌడ్. పొలాస సాయికుమార్. మూల సోమయ్య గౌడ్. జలంధర్ లక్ష్మణ్ గౌడ్ , ఫజల్. బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి వారికి శ్రావణమాస విశేష పూజలు





**కీసర, సెప్టెంబర్07హంసకలం వార్త**

శ్రీ భవాని శివ దుర్గ సమేత రామలింగేశ్వర స్వామి వారి పల్లకి సేవ ఊరేగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. శ్రావణమాసం ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం, శ్రావణ ఏకాదశి సందర్భంగా విశేష అభిషేకం స్వామివారికి నిర్వహించారు. ఈ సందర్భంగా రేంజ్ ఫారెస్ట్ అధికారి విష్ణు దంపతులు, ఎక్సైజ్ జాయింట్ కమిషనర్ సురేష్ రాథోడ్ కుటుంబ సమేతంగా శ్రీ రామలింగేశ్వర స్వామి వారి దర్శనానికి వచ్చారు. దర్శనానంతరం ఆలయ చైర్మన్ అర్చకులు ఆయనకి ఆశీర్వచనం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తటాకం వెంకటేష్ శర్మ దంపతులు, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ నాగలింగం శర్మ, ఆలయ ఈవో కట్ట సుధాకర్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ అనిల్ ఆలయ అర్చకులు పాల్గొన్నారు.



## బీఆర్ఎస్ పార్టీ నాయకుల అరెస్టులను నిరసిస్తూ మేడ్చల్ జాతీయ రహదారిపై గులాబీ శ్రేణుల రాస్తారోకో...





**మేడ్చల్, సెప్టెంబర్ 07, హంసకలం వార్త:**

బీఆర్ఎస్ పార్టీ అగ్రనాయకులు మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు, జగదీష్ రెడ్డి, సబితా ఇంద్రా రెడ్డిలతో పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల అరెస్టులను నిరసిస్తూ మేడ్చల్ బీఆర్ఎస్ శ్రేణులు నల్లటి కండువా మేడలో ధరించి భాస్కర్ యాదవ్ ఆధ్వర్యంలో 44వ జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. సమాచారం అందుకున్న సీఐ అంజిరెడ్డి సిబ్బందితో చేరుకొని ఆందోళనకారులను అదుపులోకి తీసుకుని ఠాణాకు తరలించారు. భాస్కర్ యాదవ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ సోమవారం రాష్ట్ర వర్షాకాల అసెంబ్లీ సమావేశాలను పురస్కరించుకుని కాంగ్రెస్ సర్కార్ వెయ్యి రోజుల పాలన వైఫల్యాలను నిరసిస్తూ నల్లటి టీ - షర్టులు ధరించి సమావేశాలకు విచ్చేస్తున్న బీఆర్ఎస్ మాజీ మంత్రులను, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డగించి వారిని గాయపర్చడంతో పాటు మహిళ ఎమ్మెల్యేలని కూడా చూడకుండా అమానుషంగా పోలీసులు వ్యవహరించారని దుయ్యబట్టారు. ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యేలను అసెంబ్లీ సమావేశాలకు హాజరు కాకుండా అడ్డుకునే హక్కు పోలీసులకు ఎవరిచ్చారని భాస్కర్ యాదవ్ ఈ సందర్భంగా ప్రశ్నించారు. ప్రతిపక్ష నాయకులను సమావేశాలకు హాజరు కాకుండా అడ్డుకుని అక్రమంగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని మండిపడ్డారు. నిరంకుశ పాలన కొనసాగిస్తున్న రేవంత్ రెడ్డికి రోజులు దగ్గరపడ్డాయని ప్రజలు గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎల్లంపేట మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీదేవి రమేశ్ నాయక్, మాజీ సర్పంచ్లు మద్దుల శ్రీనివాస్ రెడ్డి, గణేశ్ నేత, రాగజ్యోతి, కౌన్సిలర్లు సద్ది నిశితా రెడ్డి, బందెల శివకుమార్, భాస్కర్, నాయకులు సందీప్ గౌడ్, తుడుం గణేశ్, విష్ణుచారి, నవీన్ రెడ్డి, సంజీవ రావు, రణదీప్ రెడ్డి, ఒగ్గు శంకర్, శైలేందర్, రాజు నాయక్, విఠల్, వెంకటేశ్, గోలి శ్రీధర్

## సమ సమాజ నిర్మాణంలో... ఉపాధ్యాయుల పాత్ర కీలకం.

**మాజీ ప్రొఫెసర్ దయానందం.**

**జవహర్ నగర్ సెప్టెంబర్ 7హంసకలం వార్త**

సమ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఆధునిక కాలంలో విద్యార్థులు ఆటలకు దూరం అవుతూ.... తరచూ ఫోన్లు చూస్తూ మానసికంగా కృంగిపోతున్నారని విద్యార్థులను సరైన మార్గంలో నడిపేది ఉపాధ్యాయులేనని మాజీ ప్రొఫెసర్ దయానందం అన్నారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ చంద్రపురి కాలనీ డివిజన్ అరుంధతి నగర్ సిఆర్పిఎఫ్ క్యాంపస్ లో ఉపాధ్యాయులకు సోమవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ప్రొఫెసర్ దయానందం హాజరై మాట్లాడుతూ నవ సమాజ నిర్మాణానికి తల్లిదండ్రులు ఉపాధ్యాయుల భాగస్వామ్యం ఎంతో అవసరమని అన్నారు. ఉపాధ్యాయులు నిత్య కృషి వలురుగా రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అపర్ణ, వైస్ ప్రిన్సిపల్ హరిశంకర్, హెచ్ఎం ఆశాజికుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



హంస కలం వార్త



## విద్యార్థులు జీవన నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి : డాక్టర్ మువ్వ రామారావు

**మిర్యాలగూడ సెప్టెంబర్ 7 హంసకలం వార్త**




విద్యార్థులుభవిష్యత్తులో రాణించాలంటే జీవన నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని జన విజ్ఞాన వేదిక జాతీయ కన్వీనర్ డాక్టర్ మువ్వా రామారావు అన్నారు. స్థానిక మిర్యాలగూడలోని కేవీఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జీవన నైపుణ్యాలు రాజ్యాంగం పైన జరిగిన చర్చా గోష్టిలో మువ్వా రామారావుసామాజికవేత్త డాక్టర్ రాజు పాల్గొన్నారు. ఈసందర్భంగావారుమాట్లాడుతూ విద్యార్థులు పాఠ్యాంశాలతో పాటు దేశ పరిస్థితులను అర్థం చేసుకొనిఎప్పటికప్పుడు తమ నైపుణ్యాలను మెరుగుపరచుకొని మెరుగైన జీవితాన్ని పొందాలని అందుకు నిరంతరం కష్టపడి చదవాలనిసూచించారు. అంబేద్కర్ ఉన్నత చదువులు చదివి ప్రపంచంలోనే గొప్ప మేధావిగా పేరు గడించాడనికొనియాడారు కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ భీమార్జున్ రెడ్డి వైస్ ప్రిన్సిపాల్ శివకృష్ణ అధ్యాపక బృందం తదితరులుపాల్గొన్నారు.

## దళిత స్పీకర్‌పై అసభ్య వ్యాఖ్యలు.. బీఆర్ఎస్ దురహంకారానికి పరాకాష్ట!

**పరిగి, సెప్టెంబర్ 7హంసకలం వార్త**



దళిత స్పీకర్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసినట్లు పేర్కొంటున్న అసభ్యకర వ్యాఖ్యలు తీవ్రంగా ఖండించాల్సినవని కొడంగల్ ఆనంద్ కో–ఆప్షన్ సభ్యుడు మండిపడ్డారు. ఇది ఒక్క స్పీకర్‌ను అవమానించడం మాత్రమే కాదు.. దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచేలా చేసిన వ్యాఖ్యలుగా తెలంగాణ సమాజం చూస్తోందని అన్నారు.ప్రజా సమస్యలపై అసెంబ్లీలో ధైర్యంగా మాట్లాడలేక, తమ నాయకుడు అసెంబ్లీకి రాకపోవడంపై సమాధానం చెప్పలేక బీఆర్ఎస్ నేతలు అసలు విషయాన్ని పక్కదారి పట్టించేందుకు అనవసర వ్యాఖ్యలకు దిగుతున్నారని విమర్శించారు. రాజకీయ విమర్శలకు హద్దులు ఉంటాయి.. కానీ రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవిని కించపరిచేలా అసభ్య పదజాలం ఉపయోగించడం ప్రజాస్వామ్య విలువలకే విరుద్ధమని అన్నారు. పదవులు, రాజకీయాలు శాశ్వతం కాదని.. కానీ ప్రజాస్వామ్య వ్యవస్థల పట్ల గౌరవం, దళితుల ఆత్మగౌరవం ఎప్పటికీ కాపాడాల్సిన విలువలని పేర్కొన్నారు. దురహంకార రాజకీయాలకు తెలంగాణ ప్రజలు తగిన సమాధానం చెబుతారని, స్పీకర్‌పై చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలను బీఆర్ఎస్ నాయకత్వం వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. "స్పీకర్ పదవిని అవమానిస్తే చూస్తూ ఊరుకోం.. దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిస్తే తెలంగాణ సమాజం సహించదు" అని కొడంగల్ ఆనంద్ కో–ఆప్షన్ సభ్యుడు హెచ్చరించారు.

## "గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా పటిష్ట భద్రతా చర్యలు"

**వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్**

**పరిగి, సెప్టెంబర్ 7హంసకలం వార్త**






వికారాబాద్ జిల్లాలో గణేష్ ఉత్సవాలు--2026ను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీస్ శాఖ పటిష్టమైన భద్రతా చర్యలకు సిద్ధమవుతోంది. తెలంగాణ రాష్ట్ర డీజీపీ శ్రీ సీవీ ఆనంద్, ఐపీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వికారాబాద్ జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, ఐపీఎస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గణేష్ మండపాలు, నిర్వాహకులు, వాహనాలు, సీసీ కెమెరాలు, నిమజ్జన మార్గాలకు సంబంధించిన వివరాలను తెలంగాణ పోలీస్ పోర్టల్‌లో ఆన్‌లైన్ ఇంటిమేషన్‌గా నమోదు చేయాలని సూచించారు. ప్రతి గణేష్ మండపాన్ని పోలీసులు క్రమం తప్పకుండా సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించాలని, నిమజ్జన మార్గాలను ముందుగానే తనిఖీ చేసి ట్రాఫిక్ నియంత్రణ, బారికేడింగ్, పార్కింగ్, మార్గ మళ్లింపులకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అదేవిధంగా సున్నిత ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడంతో పాటు సోషల్ మీడియాలో వ్యాప్తి చెందే వదంతులు, తప్పుడు సమాచారంపై అప్రమత్తంగా ఉండాలని పోలీసు అధికారులకు సూచించారు. ప్రజల సహకారంతో గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిర్వహించేలా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు ఎస్పీ శ్రీ రాజేష్ మీనా, ఐపీఎస్, జిల్లా పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల విఫల పాలనకు నిరసనగా బిఆర్ఎస్ ఆందోళన.. ఆర్డీవోకు వినతిపత్రం అందజేత :





**మిర్యాలగూడ సెప్టెంబర్ 7హంసకలం వార్త**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు అవుతున్న ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని ఆరోపిస్తూ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం పార్టీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. మిర్యాలగూడ పట్టణంలోని రెడ్డి కాలనీలోగల బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు సమావేశమై కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాల్సిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ర్యాలీగా బయలుదేరి గాంధీ విగ్రహం, బస్టాండ్ మీదుగా రౌండ్ దాకా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని నినాదాలు చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను,ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆర్డీవో రమణారెడ్డి, ఎంపీడీవో కార్యాలయంలో నోడల్ అధికారి ఎంపీడీవో శేషగిరి శర్మ తహసిల్దార్ శ్రీనివాస్ లకు వినతి పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తిప్పన విజయసింహ రెడ్డి, చింత రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఎడవెల్లి శ్రీనివాస రెడ్డి, అన్నబీమోజు నాగార్జున చారి, ఎండి.ఇలియాస్ ఖాన్, ధనావత్ చిట్టిబాబు నాయక్,ఎండి.మగ్దుం పాషా, ఎండి.మాజీద్, పద్మశెట్టి కోటేశ్వర రావు, గంగుల బిక్షం, చంద్రశేఖర రావు, రవి, దుర్గాప్రసాద్, మట్టపల్లి సైదులుయాదవ్,ఎండి.షోయబ్,యర్రమల్ల దినేష్, చౌగాని బిక్షం గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, జానయ్య, జక్క నాగేశ్వరరావు,సూర్య నాయక్, ధనావత్ వెంకటేశ్వర్లు నాయక్, పిసికె ప్రసాద్, ఎలకాని రమణ, పాశం నరసింహారెడ్డి,పులి జగదీష్, వింజం శ్రీధర్, పెండ్యాల పద్మ,కోదాటి రమా, షహనాజ్ బేగం,పెరుమాళ్ళ ధనమ్మ, లలిత, శ్రీను నాయక్ , తుమ్మలఫణి కుమార్, ఎండి గయాజ్, ఆయిల్ శ్రీను, ఇక మణిదీప్, శ్రీనాథ్ , తిన్న పోయిన శ్రీనివాస్ యాదవ్ , మదర్ , జిడిఆర్ జానీ, ఎస్డి, శంకర్ నాయక్, మస్తాన్, నూనె రవికుమార్, ముబిన్, ఖలీల్, మలవత్ రవీందర్ నాయక్, జీవన్, వల్లంపట్ల వినోద్, మర్రి అంజిబాబు, చందు యాదవ్, మొండి కత్తి లింగయ్య,ఏలుగుబెల్లి,నాగరాజు, నర్ర ముకేశ్ చౌదరి, నాయకులు, ప్రజాప్రతినిధులు, వార్డు ఇన్‌చార్జిలు, పార్టీ కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసుల అడ్డగింత... నిరసిస్తూమిర్యాలగూడలో రాస్తారోకో





**మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావు ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ**

**మిర్యాలగూడ,సెప్టెంబర్ 7 హంసకలం వార్త**

అసెంబ్లీకి వెళ్లకుండా బీఆర్ఎస్ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలను అడ్డుకోవడంతో పాటు, బీఆర్ఎస్ నాయకులు ప్రజాప్రతినిధులపై పోలీసులు వ్యవహరించిన తీరు, ధోరణికి నిరసనగా సోమవారం బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రవ్యాప్త నిరసనల పిలుపు మేరకుమిర్యాలగూడలో మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ నిరసన చేశారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం నుండి భారీ ర్యాలీగా నాయకులు, కార్యకర్తలు నల్లబ్యాడ్జీలు ధరించి కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాస్వామ్య వ్యతిరేక వైఖరికి ర్యాలీగా వచ్చి నిరసన ప్లకార్డులు ప్రదర్శించి

స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద రాస్తారోకో నిర్వహించి కాంగ్రెస్ ప్రభుత్వానికి, పోలీసుల తీరుకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యబద్ధంగా తమ నిరసనను వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలను అసెంబ్లీకి రాకుండా అడ్డుకోవడం,నాయకులపై పోలీసులతో అడ్డుకోవడం అత్యంత దుర్మార్గమన్నారు. ప్రతిపక్షాల గొంతు నొక్కడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వంప్రజాస్వామ్యాన్నిఖూనీచేస్తోందన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు,ప్రతిపక్షాలహక్కులనుపరిరక్షించేందుకు బీఆర్ఎస్ పోరాటం మరింత ఉధృతం చేస్తామని భాస్కర్ రావు పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావు తో పాటు మరికొంతమందిని పోలీసులు అదుపులోకి తీసుకుని రాస్తారోకో విరమింపజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, చింతరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఎడవెల్లి శ్రీనివాస రెడ్డి, అన్నబీమోజు నాగార్జున చారి, ఎండి.ఇలియాస్ ఖాన్, ధనావత్ చిట్టిబాబు నాయక్, ఎండి.మగ్దుం పాషా, ఎండి.మాజీద్, పద్మశెట్టి కోటేశ్వరరావు, గంగుల బిక్షం, రావూరి సుధాకర్, చంద్రశేఖర రావు, రవి,దుర్గాప్రసాద్, మట్టపల్లి సైదులు యాదవ్,ఎండి.షోయబ్,యర్రమల్ల దినేష్, చౌగాని బిక్షం గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, జానయ్య, జక్క నాగేశ్వరరావు, సూర్య నాయక్, ధనావత్ వెంకటేశ్వర్లు నాయక్, పిసికె ప్రసాద్, ఎలకాని రమణ,పాశంనరసింహారెడ్డి, పులి



జగదీష్, వింజం శ్రీధర్, పెండ్యాల పద్మ, షహనాజ్ బేగం, కె.రమా, పెరుమాళ్ళ ధనమ్మ, లలిత, శ్రీనునాయక్ , తుమ్మల ఫణికుమార్,ఎండి.నాహిద్, ఎండి.గయాస్, ఆయిల్ శ్రీను, ఇక మణిదీప్, శ్రీనాథ్ , పిన్నబోయిన శ్రీనివాస్ యాదవ్ , మధార్, జిడిఆర్ జానీ, ఎస్డి, శంకర్ నాయక్, మస్తాన్, నూనె రవికుమార్, ముబిన్, ఖలీల్, మస్తాన్, మాలోత్ రవీందర్ నాయక్, జీవన్, వల్లంపట్ల వినోద్ నాయక్, మర్రి అంజిబాబు, చందుయాదవ్, ఏలుగుబెల్లి నాగరాజు, నర్ర ముకేశ్ చౌదరి, గోపి, నగేష్ చంటి శ్రీకాంత్ కిరణ, అంజి, అనిల్, జనాపాల కిరణ్, నాకు నాయక్, హన్ను, వీరయ్య, ఇమ్రాన్, సందీప్, నాయకులు, ప్రజాప్రతినిధులు, వార్డు ఇన్‌చార్జిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వక్ఫ్ భూములు రక్షించాలి..సర్వే చేసి హద్దులు నిర్ధారించాలి : ఎమ్మెల్సీ శంకర్ నాయక్

**ముస్లిం నిరుద్యోగులకు అవుట్ సోర్సింగ్ కింద ఉద్యోగ అవకాశాలు కల్పించాలి :**

**మిర్యాలగూడ సెప్టెంబర్ 7హంసకలం వార్త**



రాష్ట్రవ్యాప్తంగా వక్ఫ్ బోర్డు చెందిన భూములను సర్వే చేసి రక్షించాలని, వాటికి హద్దులు నిర్ధారించి కాంపౌండ్ వాల్ కట్టాలని శాసనమండలి సభ్యులు కేతవత్ శంకర్ నాయక్ సూచించారు. సోమవారం శాసన మండలి సమావేశంలో ముస్లిం మైనార్టీల భూములు, వక్ఫ్ బోర్డు పరిధిలో ఉన్న భూములు అనేక చోట్లఅన్యాక్రాంతమౌతున్నాయని వాటిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, మండలి దృష్టికి తీసుకువచ్చారు. నల్గొండ జిల్లా కేంద్రంలోని లతీషావలి దర్గా, సూర్యాపేట జిల్లాలోని జాన్ పహాడ్ దర్గా, అర్వపల్లి దర్గా ప్రాంతాల్లో భూములు, ఈద్గా భూములు, ఆక్రమణకు గురయ్యాయని సభా దృష్టికి తీసుకొచ్చారు. మైనార్టీ గురుకుల, మైనార్టీవిద్యాసంస్థలలో నిరుద్యోగులైన ముస్లింలకు ఔట్ సోర్సింగ్ ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు.

హంస కలం వార్త

# హమారా ప్రసాద్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి

**అంబేద్కర్‌ను కించపరిచే పుస్తక ఆవిష్కరణను రద్దు చేయాలి**

**కోరుట్ల సెప్టెంబర్ 07 హంసకలం వార్త**

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌ను కించపరిచేలా రూపొందిస్తున్న కల్పిత నాయకుడు -- ది ఫాల్స్ లీడర్ పుస్తక రచయిత హమారా ప్రసాద్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని అంబేద్కర్ సంఘం, ఎం.జె.ఎఫ్. రాష్ట్ర నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కోరుట్లలో అంబేద్కర్‌వాదులు దళిత సంఘాల నాయకులతో కలిసి ఆర్డీఓ డి.టి. రాజ్ మహమ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అంబేద్కర్‌ను అవమానించేలా ఉన్న పుస్తకాన్ని ఆవిష్కరించకుండా అడ్డుకోవాలని హమారా ప్రసాద్‌ను వెంటనే అరెస్టు చేయాలని కోరారు. పుస్తకం ద్వారా వివిధ సామాజిక వర్గాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే అవకాశం ఉందని ఇది ప్రజాశాంతి సామాజిక సామరస్యానికి విఘాతం కలిగించేలా ఉందని ఆరోపించారు. సంబంధిత సోషల్ మీడియా ఖాతాలను బ్లాక్ చేసి పుస్తక ఆవిష్కరణను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా



జిల్లా మండల గ్రామ స్థాయిలో నిరసనలు ధర్నాలు రాస్తారోకోలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ముఖినిపెల్లి గంగా నర్సయ్య, జాగర్ల రాజం, కొంతం గంగరాజం, బంగారి రాజం, కొమ్ము శేఖర్, నిఘా రమేష్, లింగంపల్లి నరేష్, జాగర్ల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీ వద్ద దీ=హా ఎమ్మెల్యేలపై పోలీసుల దురుసు ప్రవర్తన -- ప్రజాస్వామ్యంపై దాడి





**దాసరి మనోహర్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే, పెద్దపల్లి నియోజకవర్గం**

**పెద్దపల్లి హంసకలం వార్త (సెప్టెంబర్ 07)**

రాష్ట్ర అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు తీవ్రంగా ఖండించాల్సిన విషయమని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ సాక్షిగా ప్రజా ప్రతినిధుల పట్ల పోలీసుల దురుసు ప్రవర్తనకు నిరసనగా పెద్దపల్లి బస్టాండ్ వద్ద సోమవారం బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అసెంబ్లీలో ప్రస్తావించేందుకు ప్రజాప్రతినిధులు వస్తే వారిని అడ్డుకుని తోపులాటకు దిగి అదుపులోకి తీసుకోవడం ప్రజాస్వామ్య వ్యవస్థకు ఏమాత్రం మంచిది కాదన్నారు. కేటీఆర్, హరీశ్‌రావు, సునీత లక్ష్మారెడ్డి, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్ తదితర బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల పట్ల పోలీసుల దురుసు ప్రవర్తన, తోపులాటలో కొందరికి గాయలవడం ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేస్తుందన్నారు. ముఖ్యంగా మహిళా ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి పట్ల పోలీసులు అనుచితంగా వ్యవహరించడం మరింత తీవ్రంగా పరిగణించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షానికి మాట్లాడే హక్కు ఉందని, ప్రజల తరఫున ప్రశ్నించే హక్కు ఉందని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలదీసే హక్కు ఉందని ఆ హక్కులను పోలీసుల బలంతో అడ్డుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నించడం సరికాదన్నారు. అసెంబ్లీ ప్రజల సమస్యలను చర్చించే పవిత్రమైన వేదికని, అక్కడికి వచ్చే ప్రజాప్రతినిధులను పోలీసులు అడ్డుకోవడం అంటే ప్రజల గొంతును అడ్డుకోవడమేన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనపై ప్రజల్లో ఉన్న అసంతృప్తిని ప్రశ్నిస్తున్నందుకే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై ఇలాంటి చర్యలకు పాల్పడుతూ ప్రజల తరఫున ప్రశ్నిస్తే అరెస్టులు చేయడం, నిరసన తెలిపితే పోలీసులతో అణచివేయడం సరికాదన్నారు.ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై ప్రభుత్వం వెంటనే సమగ్ర విచారణ జరిపించి బాధ్యులైన పోలీసు అధికారులపై చర్యలు తీసుకుని ప్రజాప్రతినిధుల హక్కులను గౌరవించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ ప్రజల సమస్యలపై పోరాటాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఆపదన్నారు. పోలీసుల బెదిరింపులకు, అక్రమ నిర్బంధాలకు భయపడేది లేదున్నారు.

# అప్పు విషయంలో బెదిరింపులు.. ప్రాణహాని ఉందంటున్న బాధితుడు

**పెద్దపలి హంసకలం వార్త(సెప్టెంబర్ 07)**

అప్పుగా తీసుకున్న డబ్బుల విషయంలో తనపై దాడి చేసి, తీవ్రంగా బెదిరించారని కమాన్‌పూర్ మండలానికి చెందిన సతీష్ కమాన్పూర్ ఆరోపించారు. తనకు ప్రాణహాని ఉందని, తనకు, తన కుటుంబానికి రక్షణ కల్పించాలని పోలీసులను, ప్రజాప్రతినిధులను ఆయన వేడుకున్నారు. సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. జూలపల్లి గ్రామానికి చెందిన సాంబయ్య వద్ద తన వ్యక్తిగత అవసరాల నిమిత్తం కొంత మొత్తాన్ని అప్పుగా తీసుకున్నట్లు తెలిపారు. ఈ వ్యవహారంలో సాంబయ్య కుమారుడు మార్కెట్ కమిటీ చైర్మన్ వైనాల రాజు, వైనాల వినోద్ బెదిరింపులకు గురి చేస్తూ. ఇంటికి పిలిపించి తనపై దాడి చేశాడని ఆరోపించారు. అంతేకాకుండా ఎక్కడ కనిపించినా చంపేస్తానని, తనపై అక్రమ కేసులు పెట్టించి ఇబ్బందులకు గురిచేస్తామని బెదిరించినట్లు సతీష్ పేర్కొన్నారు. దీంతో తన ప్రాణాలకు ముప్పు ఉందని, ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించినట్లు తెలిపారు. తనపై దాడి జరుగుతున్న సమయంలో భయంతో 100కు ఫోన్ చేయగా పోలీసులు స్పందించి తనను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారని సతీష్ తెలిపారు. అయితే అక్కడ కూడా తనకు న్యాయం జరగలేదని, తనపైనే కేసు నమోదు చేస్తామని బెదిరింపులకు గురిచేశారని ఆరోపించారు. తనకు ప్రాణహాని ఉందని పలుమార్లు పోలీసులకు విన్నవించినప్పటికీ తగిన రక్షణ కల్పించలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వైనాల రాజు. వైనాల వినోద్ వల్ల తాను భయభ్రాంతులకు గురవుతున్నానని తెలిపారు. తాను డబ్బులు అప్పుగా తీసుకున్న విషయం వాస్తవమేనని, అయితే ఆ కారణంగా తనపై దాడి చేయడం, బెదిరించడం సరికాదని సతీష్ అన్నారు. తనకు, తన కుటుంబానికి రక్షణ కల్పించి, తనపై జరిగిన దాడి, బెదిరింపులపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. ఈ మేరకు పోలీసు ఉన్నతాధికారులతో పాటు ప్రజాప్రతినిధులను ఆయన వేడుకున్నారు. తన ప్రాణాలను కాపాడి, కుటుంబానికి భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు.




## ప్రతిపక్ష గొంతు నొక్కడమే ప్రజాస్వామ్యమా

● **బీఆర్ఎస్ లీగల్ సెల్ చీఫ్ కన్వీనర్ : బైరి విజయ్ కుమార్**

**కోరుట్ల, సెప్టెంబర్ 07 హంసకలం వార్త**



తెలంగాణ అసెంబ్లీ ఎదుట సోమవారం చోటుచేసుకున్న పరిణామాలు ఆందోళన కలిగించేలా ఉన్నాయని బీఆర్ఎస్ కోరుట్ల పట్టణ, మండల లీగల్ సెల్ చీఫ్ కన్వీనర్ బైరి విజయ్ కుమార్ అన్నారు. పోలీసులు ప్రజాస్వామ్య రక్షకులా లేక అడ్డంకులా ప్రతిపక్ష గొంతు నొక్కడమే ప్రజాస్వామ్యమా అని ప్రశ్నించారు. ప్రజలు ఎన్నుకున్న ప్రతిపక్ష ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అసెంబ్లీలో ప్రజా సమస్యలను ప్రస్తావించడం వారి హక్కు అన్నారు. ప్రజాప్రతినిధులను పోలీసులు అడ్డుకోవడం, అరెస్టులు చేయడం, తోపులాటలకు దారితీసి గాయాలకు కారణం కావడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. నల్ల దుస్తులతో నిరసన తెలపడం రాజకీయ నిరసన విధానమని, అభ్యంతరాలుంటే సభా నియమాల ప్రకారం చర్యలు తీసుకోవాలే తప్ప పోలీసు బలాన్ని ప్రయోగించడం పరిష్కారం కాదన్నారు. అసెంబ్లీ అధికార పార్టీకి మాత్రమే చెందిన ప్రదేశం కాదని, అది ప్రజల సభ అని పేర్కొన్నారు. అధికార పక్షంతో పాటు ప్రతిపక్షానికి కూడా సమాన ప్రాధాన్యత ఉందన్నారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన ఎమ్మెల్యేలను అసెంబ్లీ గేటు వద్దే అడ్డుకుంటే సమస్యలను ఎక్కడ ప్రస్తావించాలన్నారు. ప్రజాస్వామ్యంలో విమర్శలను స్వీకరించే ధైర్యం, ప్రశ్నలకు సమాధానం చెప్పే బాధ్యత ప్రభుత్వానికి ఉండాలని అన్నారు. మహిళా, పురుష ప్రజాప్రతినిధులతో పోలీసులు గౌరవం, సంయమనం, చట్టబద్ధమైన విధానంతో వ్యవహరించాలని కోరారు. సోమవారం జరిగిన ఘటనలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారం, పదవులు శాశ్వతం కాదని, ప్రజాస్వామ్య విలువలే శాశ్వతమని అన్నారు. తెలంగాణ ఉద్యమం ప్రజల హక్కులు, ప్రశ్నించే హక్కు, స్వేచ్ఛ కోసం సాగిందని గుర్తుచేశారు. ప్రశ్నించే గొంతును అడ్డుకోవచ్చేమో కానీ ప్రజల గొంతును శాశ్వతంగా అణచివేయలేరని విజయ్ కుమార్ అన్నారు. ప్రజా సమస్యలు, ప్రజాస్వామ్య పరిరక్షణ, రాజ్యాంగ హక్కుల కోసం బీఆర్ఎస్ చట్టబద్ధ, ప్రజాస్వామ్య మార్గాల్లో పోరాటాన్ని మరింత బలంగా కొనసాగిస్తుందని తెలిపారు.

## గణేశ నవదుర్గ మండలి అధ్యక్ష పదవికి కటుకం గణేష్ రాజీనామా

**కోరుట్ల, సెప్టెంబర్ 07 హంసకలం వార్త:**



కోరుట్ల గణేశ నవదుర్గ మండలి అధ్యక్ష పదవికి కటుకం గణేష్ రాజీనామా చేశారు. ఈ మేరకు సోమవారం మండలి గౌరవ అధ్యక్షులు కట్ట నారాయణకు తన రాజీనామా పత్రాన్ని అందజేశారు. వ్యక్తిగత కారణాలతో పాటు మండలికి తగిన సమయం కేటాయించలేకపోతున్నందున అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు గణేష్ తెలిపారు. అయితే గణేశ నవదుర్గ మండలి క్రియాశీలక సభ్యునిగా కొనసాగుతానని పేర్కొన్నారు. గత మూడేళ్లుగా తనకు అన్ని విధాలుగా సహకరించిన మండలి క్రియాశీలక సభ్యులు, కార్యవర్గ సభ్యులకు కటుకం గణేష్ కృతజ్ఞతలు తెలిపారు.

## కోరుట్ల మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలు ప్రారంభం

**కోరుట్ల, సెప్టెంబర్ 07 హంసకలం వార్త :**



కోరుట్ల పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో సోమవారం మండల స్థాయి ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. మున్సిపల్ చైర్మన్ తిరుమల వసంత -- గంగాధర్ ఆధ్వర్యంలో పోటీలను ప్రారంభించారు. తొలిరోజు వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు కబడ్డీ పోటీలు నిర్వహించారు. రానున్న రోజుల్లో ఖోఖో, వాలీబాల్ తదితర పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి గంగుల నరేశం, మండల కన్వీనర్ బి. శ్రీనివాస్, ట్రాస్మా అధ్యక్షుడు భారీ, స్థానిక కౌన్సిలర్ వాసిం, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పిచ్చిమొక్కలతో కనుమరుగైన రహదారి

**రాయికల్, సెప్టెంబర్ 7హంసకలం వార్త**

రాయికల్ పట్టణంలోని హేమ థియేటర్ పక్కన ఉన్న రహదారి నిర్వహణ లేక పిచ్చిమొక్కలు, చెత్త, పొదలతో నిండిపోయి రాకపోకలకు ఇబ్బందిగా మారిందని మాజీ వార్డు సభ్యులు మహమ్మద్ షాకీర్ ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. సుమారు 30 సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో రహదారి ఉందని, గత మూడేళ్లుగా సరైన నిర్వహణ లేకపోవడంతో ప్రస్తుతం రోడ్డు ఆనవాళ్లు కూడా కనిపించని దుస్థితి నెలకొందని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా మహమ్మద్ షాకీర్ మాట్లాడుతూ.. హేమ థియేటర్ పక్కన ఉన్న రహదారి ఒకప్పుడు ప్రజల రాకపోకలకు ఉపయోగపడేదని తెలిపారు. అయితే గత కొంతకాలంగా రహదారిపై పేరుకుపోయిన చెత్తను తొలగించకపోవడం, పిచ్చిమొక్కలు, పొదలను తొలగించకపోవడంతో రహదారి పూర్తిగా కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. దీంతో స్థానికులు, ఈ మార్గం గుండా వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.రాత్రి వేళల్లో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా ఉంటోందని, పిచ్చిమొక్కలు, పొదల కారణంగా రహదారి ఎక్కడుందో గుర్తించడం కూడా కష్టంగా మారిందని పేర్కొన్నారు. ప్రజలకు ఉపయోగపడే రహదారి ఇంతకాలం నిర్లక్ష్యానికి గురికావడం బాధాకరమన్నారు.ఇప్పటికైనా సంబంధిత మున్సిపల్ అధికారులు స్పందించి హేమ థియేటర్ పక్కన ఉన్న రహదారిని పరిశీలించాలని, రోడ్డుపై పెరిగిన పిచ్చిమొక్కలు, పొదలు, చెత్తను వెంటనే తొలగించాలని కోరారు. అనంతరం రహదారికి అవసరమైన మరమ్మతులు చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కాలనీ వాసులు డిమాండ్ చేశారు.

హంస కలం వార్త

## నాని 'ది ప్యారడైజ్' విడుదల వాయిదా? సెప్టెంబర్ 24పై అనుమానాలు!




నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా నటిస్తున్న యాక్షన్ డ్రామా 'ది ప్యారడైజ్' విడుదల తేదీపై మళ్లీ నీలినీడలు కమ్ముకున్నాయి. ముందుగా ప్రకటించిన ప్రకారం సెప్టెంబర్ 24న ఈ చిత్రాన్ని విడుదల చేయాల్సి ఉండగా, కొన్ని కారణాల వల్ల వాయిదా పడే అవకాశం ఉందని టాలీవుడ్‌లో జోరుగా ప్రచారం జరుగుతోంది. పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో జాప్యం కారణంగా సినిమాను అక్టోబర్ 1వ తేదీకి మార్చాలని చిత్రబృందం భావిస్తున్నట్లు తెలుస్తోంది.ఫిల్మ్ నగర్ వర్గాల సమాచారం ప్రకారం, 'ది ప్యారడైజ్' క్లైమాక్స్‌లో భారీ స్థాయిలో వీఎఫ్ఎక్స్, సీజీ వర్క్ ఉంది. ఈ గ్రాఫిక్స్ పనులు అనుకున్న సమయానికి పూర్తి కావడం లేదని, అందుకే విడుదల తేదీని వాయిదా వేయాలనే ఆలోచనలో ఉన్నారని అంటున్నారు. నిర్మాత సుధాకర్ చెరుకూరి ఒక్క క్లైమాక్స్ సీజీ వర్క్ కోసమే సుమారు రూ.2 కోట్లు ఖర్చు చేస్తున్నారని, నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీ పడకూడదనే ఉద్దేశంతోనే ఈ జాప్యం జరుగుతోందని సమాచారం.ఒకవేళ ఈ సినిమా అక్టోబర్ 1కి వాయిదా పడితే, బాక్సాఫీస్ వద్ద ఆసక్తికర పోటీ నెలకొననుంది. నాగవంశీ నిర్మించిన 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం. 47' అక్టోబర్ 2న విడుదల కానుంది. విశేషమేమిటంటే, 'ది ప్యారడైజ్' నైజాం హక్కుల్లో నాగ వంశీకి 25 శాతం వాటా ఉంది. గతంలో 'ది ప్యారడైజ్' కోసం ఆయన తన సినిమాను వాయిదా వేసుకున్నారు. ఇప్పుడు ఈ రెండు చిత్రాలు దాదాపు ఒకేసారి విడుదలయ్యే పరిస్థితి ఏర్పడుతోంది. అక్టోబర్ రెండో వారంలో విజయ్ దేవరకొండ 'రణబాలి', సూపర్ స్టార్ రజనీకాంత్ 'జైలర్ 2' వంటి పెద్ద సినిమాలు కూడా రానుండటంతో పోటీ మరింత తీవ్రంగా ఉండనుంది.ఇప్పటికే 'ప్యారడైజ్' సినిమా రెండుసార్లు వాయిదా పడింది. తొలుత మార్చి 26, ఆ తర్వాత ఆగస్టు 21 తేదీలను ప్రకటించి, చివరకు సెప్టెంబర్ 24ను ఖరారు చేశారు. ఇప్పుడు మరోసారి వాయిదా పడితే ఇది మూడోసారి అవుతుంది. ఇది డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లపై ప్రభావం చూపే అవకాశం ఉంది. అయితే, ఈ వాయిదా వార్తలపై చిత్రబృందం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ప్రస్తుతానికి సెప్టెంబర్ 24నే అధికారిక విడుదల తేదీగా ఉంది. త్వరలోనే నాని చిత్రబృందంతో సమావేశమై తుది నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. రాబోయే కొద్ది రోజుల్లో దీనిపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## పారిశ్రామిక విప్లవంలాగే ఏఐ.. ఆలోచించే ఉద్యోగాలను తినేస్తుంది: ఆర్జీవీ



విలక్షణ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ మరోసారి తనదైన శైలిలో సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రాకతో మానవ మేధస్సుకు, సృజనాత్మకతకు ముప్పు పొంచి ఉందని హెచ్చరించారు. ఒకప్పుడు పారిశ్రామిక విప్లవం శారీరక శ్రమతో కూడిన ఉద్యోగాలను ఎలా అయితే తుడిచిపెట్టిందో, ఇప్పుడు ఏఐ ఆలోచనతో కూడిన ఉద్యోగాలను కనుమరుగు చేస్తుందని జోస్యం చెప్పారు.ఈ అంశంపై తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో వర్మ ఓ సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. "ఏఐని వెంటనే అందిపుచ్చుకోని వారి ఉద్యోగాలే ముందుగా కనుమరుగవుతాయి. సాంకేతికత ఎప్పుడూ మన సౌలభ్యం కోసమే రూపొందింది. శారీరక శ్రమ, సమయం వృథా చేసే పనుల నుంచి మనల్ని కాపాడటానికే అది ఉంది. మనం ఎప్పుడూ స్వేచ్ఛా సమయం కోరుకుంటాం. ఇప్పుడు ఏఐ మనకు ఆ స్వేచ్ఛను శాశ్వతంగా ఇచ్చేస్తోంది. మానవులుగా మనకు రెండు ఆస్తులు ఉన్నాయి.. ఒకటి కండబలం, మరొకటి ఆలోచించే మెదడు. పారిశ్రామిక విప్లవం కండబలాన్ని తుడిచిపెడితే, ఇప్పుడు ఏఐ మన మెదళ్లను తుడిచిపెడుతోంది. 'కోరుకున్నది నిజమైతే ప్రమాదం' అని చెప్పినట్లుగా ఇది జరుగుతోంది" అని వర్మ తన పోస్టులో విశ్లేషించారు.ఇలా ఏఐపై తన అభిప్రాయాలను పంచుకున్న వర్మ, ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. మనోజ్ బాజ్‌పేయ్, జెనీలియా దేశ్‌ముఖ్ ప్రధాన పాత్రల్లో 'పోలీస్ స్టేషన్ మే భూత్' అనే చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. దీనితో పాటు 'పోలీస్ కంపెనీ' అనే మరో ఆసక్తికర ప్రాజెక్టును కూడా రూపొందిస్తున్నారు. ఇందులో హర్షవర్ధన్ రాణే ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. 'ఇది డి కంపెనీ కన్నా ప్రమాదకరం' అనేది 'పోలీస్ కంపెనీ' సినిమా ట్యాగ్‌లైన్. అదనపు అధికారాలు చేతికి వచ్చినప్పుడు ఒక పోలీస్ వ్యవస్థ ఎలా ఒక కంపెనీగా మారుతుందనే కథాంశంతో ఈ సినిమా ఉంటుందని వర్మ గతంలోనే వెల్లడించారు. దావూద్ ఇబ్రహీం, చోటా రాజన్‌ల మధ్య విభేదాలు తలెత్తిన తర్వాత ముంబై అండర్‌వరల్డ్‌లో ఏర్పడిన శూన్యత నేపథ్యంలో ఈ కథ సాగుతుందని తెలిపారు. ఇందులో హర్షవర్ధన్ రాణే.. దయా నాయక్ పాత్ర స్ఫూర్తితో రూపొందించిన క్యారెక్టర్‌లో నటిస్తున్నట్లు సమాచారం.



## నా కెరీర్ నాశనం చేసినవారి పతనం చూస్తా: బాలీవుడ్ నటి తనూశ్రీ దత్తా

బాలీవుడ్ నటి, మాజీ మిస్ ఇండియా యూనివర్స్ తనూశ్రీ దత్తా సోషల్ మీడియాలో మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. తన జీవితంలో కష్టాలకు, కెరీర్‌లో ఎదుగుదలకు అడ్డుపడిన వారికి తీవ్రమైన హెచ్చరికలు జారీ చేస్తూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక పోస్ట్ పెట్టారు. కర్మ సిద్ధాంతాన్ని ప్రస్తావిస్తూ, తనకు అన్యాయం చేసిన వారు తప్పకుండా పర్యవసానాలు ఎదుర్కొంటారని, వారి పతనాన్ని తాను కళ్లారా చూస్తానని పేర్కొన్నారు. ఈ పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

**ఇన్‌స్టాగ్రామ్ పోస్టులో ఏముందంటే..**

"నన్ను నా సహజ మార్గం నుంచి పక్కకు తప్పించి, బాధపెట్టిన వారికి చెబుతున్నా. నా వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితాలు మళ్లీ అద్భుతంగా పుంజుకుంటాయి. నా తప్పు లేకుండా నన్ను బాధించిన ప్రతి ఒక్కరి పతనాన్ని నేను చూస్తాను" అని తనూశ్రీ రాసుకొచ్చారు. "కర్మ చక్రాలు తిరుగుతున్నాయి. రాబోయే కాలం నాది. నాపై కుట్రలు పన్ని, నన్ను మానసికంగా హింసించి, నాపై నిఘా పెట్టి దాడి చేసిన ఆ దుర్మార్గులు భయంకరమైన శక్తుల చేతిలో చిక్కి శాశ్వతంగా వేధింపులకు గురవుతారు. వాళ్లు చేసిన పాపాలకు వాళ్లే పశ్చాత్తాపపడతారు. వాళ్ల జీవితాలు వాళ్ల కళ్ల ముందే నాశనమవుతాయి" అంటూ తీవ్ర పదజాలంతో హెచ్చరించారు.

**గతంలోనూ ఆరోపణలు**

గత నెలలో కూడా తనూశ్రీ తన కెరీర్‌ను కొందరు ఉద్దేశపూర్వకంగా దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. "శత్రు శిబిరానికి చెందిన కొందరు వ్యక్తులు" తనకు పని అవకాశాలు రాకుండా అడ్డుకుంటున్నారని, తనకు మంచి ప్రాజెక్టులు, బ్రాండ్‌ల నుంచి ఆఫర్లు వచ్చినా వాటిని తప్పుదారి పట్టిస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.2018లో బాలీవుడ్‌లో సంచలనం సృష్టించిన మీటూ ఉద్యమంలో తనూశ్రీ దత్తా కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. 2008లో 'హార్న్ ఓకే ప్లీజ్' సినిమా చిత్రీకరణ సమయంలో సీనియర్ నటుడు నానా పటేకర్ తనతో అసభ్యంగా ప్రవర్తించారని ఆమె బహిరంగంగా ఆరోపణలు చేశారు. అప్పటి నుంచి, ఇండస్ట్రీలో తనకు ఎదురవుతున్న ఇబ్బందుల గురించి ఆమె పలు సందర్భాల్లో గళం విప్పుతూనే ఉన్నారు.

Edited, Printed,Published and Owned by **V. Madhusudan chary** , Lake view krishna residency.Flat no 102.Road no 4 Jaya nagarNear Ganesh Mandapam Kukatpally Telangana 500072,
Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, **PRGI TGTEL/26/A3129** Cell.No 9966555449